
విజయం
ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం
పేజీలు : 08
అక్షర సమరానికి నాంది..
మంగళవారం / మే 30 / 2023
https://vijayamdaily.com

## ధాన్యం, మొక్కజొన్నలను త్వరగా కొనుగోలు పూర్తి చేయాలి

- ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలి
- అధికారులకు ఆధేశించిన కలెక్టర్ వి.పి.గౌతమ్



**ఖమ్మం, మే 29(విజయం న్యూస్):** ధాన్యం, మొక్కజొన్న సేకరణలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం ఐడిఓసి లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్పోర్టర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రాల్లో సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు కేటాయించిన రైస్ మిల్లులకు రవాణా అయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 236 ధాన్య సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు, ఇప్పటి వరకు 198 కేంద్రాల ద్వారా 14,954 మంది రైతుల నుండి 122619.240 మెట్రిక్ టన్నుల ధాన్య సేకరణ చెందినట్లు ఆయన తెలిపారు. మిగతా 3లో..



- నిరుద్యోగుల విషయంలో సీఎంపై ధ్వజమెత్తిన మాజీ ఎంపీ
- ఇంటికో ఉద్యోగం అన్నరు.. ఎప్పడిస్తారు..?
- నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు...?
- నోటిఫికేషన్ వేసి.. పేపర్ లీకేజీలు చేస్తారు..
- ఉద్యోగాలివ్వలేకనే పేపర్ లీకేజీ డ్రామా
- మెగా జాబ్ మేళా సందర్భంగా సీఎంపై మండిపడిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

# సీఎంని వదలని పొంగులేటి



(ఖమ్మం ప్రతినిధి-విజయంన్యూస్)
సీఎం కేసీఆర్ పై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందు దొరికినప్పుడల్లా ఆరోపణలు చేస్తున్నారు.. రాజకీయ సభల, సమావేశాల్లోనే కాకుండా నిరుద్యోగులకు ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో కూడా సీఎం కేసీఆర్ పై ఓ రెంజీలో ద్వజమెత్తారు. ఇంటికో ఉద్యోగం అంటూ ఉద్యమ సమయంలో నిరుద్యోగులను రెచ్చగొట్టిన సీఎం కేసీఆర్, ఫీఠమెక్కిన తరువాత నిరుద్యోగుల నోట్లో మన్నుగొట్టారని ఆరోపించారు. సోమవారం ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ లో ఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా లో ముఖ్యఅతిథిగా హాజరైన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిరుద్యోగులతో మాట్లాడారు.అనంతరం ఈ సందర్భంగా ఏర్పాటు చూసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో తీవ్రమైన సమస్యలు పేరుకు పోయాయని ఆరోపించారు. అన్ని వర్గాల వారిని సీఎం కేసీఆర్ తన మాటలతో మభ్యపెట్టారని, ప్రధానంగా ఇంటికి ఓ ఉద్యోగం ఇస్తానని మోసం చేశారన్నారు. వివరాలు 04లో..

# కేసీఆర్‌ను గద్దె దింపే.. దమ్మునోళ్లా..?



- ఏం చూసి ఎగిరిపడుతున్నారు..?
- మీరు రంకెలేస్తే.. ప్రజలే కళ్లెం వేస్తారు..
- పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం మాది అనేక
- ప్రతిపక్ష నేతలపై మండిపడిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్
- పినపాక నియోజకవర్గంలో మంత్రి పువ్వాడ విస్తృత పర్యటన..
- రూ.22.77 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేసిన పువ్వాడ, ప్రభుత్వ విప్ రేగ..

(ఖమ్మం ప్రతినిధి, మణుగూరు-విజయం న్యూస్)
రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఅర్ ని గద్దె దింపుతాం... బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దించేస్తాం అంటూ రంకెలేస్తున్న వారికి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చురకలంటించారు. సీఎం కేసీఆర్ ను, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దే దింపే దమ్మునోళ్లా మీరు..? రంకేలేస్తున్నారు..? ప్రజలే కళ్లెం వేస్తారని, అది గ్రహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రతిపక్ష నాయకులకు చురకలు అంటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని బూర్గంపహాడ్, అశ్వాపురం, మణుగూరు మండలాల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. సోమవారం నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ రెగా కాంతారావుతో కలిసి రూ.22.77 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామం నుండి టేకుల చెరువు వరకు రూ.3.87 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు.



అశ్వాపురం మండలం నెల్లిపాక నుండి మణుగూరు వెళ్ళే దారిలో రూ.1.80 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అశ్వాపురం మండలం తుమ్మలచెరువు గ్రామంలో అశ్వాపురం నుండి మొండికుంట వెళ్ళే దారిపై రూ.5 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వివరాలు 03లో..

# అట్టహాసంగా 'దశాబ్ది' సంబురాలు చేద్దాం

- **తెలంగాణ ప్రగతి ప్రతిబింబించేలా పండుగ వాతావరణంలో సంబురం చేయాలి**
- **పరస్పర సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయాలి**
- **అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి పువ్వాడ పిలుపు**
- **అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి**
- **తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని పల్లెపల్లెన ఆవిష్కరింపజేయాలి**
- **శాఖల వారీగా పక్కా ప్రణాళికతో నిర్దేశిత కార్యక్రమాలు నిర్వహించాలి**
- **అధికారులు, ప్రజాప్రతినిధులను కార్యోన్ముఖులు చేసిన మంత్రి పువ్వాడ**




**(కొత్తగూడెం, ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన అనతి కాలంలోనే తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను సీఎం కేసీఆర్ ఆదేశానుసారం అట్టహాసంగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ, పల్లెపల్లెన తెలంగాణ ప్రగతిని ఆవిష్కరింపజేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పనిచేస్తూ దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలని వారిని కార్యోన్ముఖులు చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ అధ్వర్యంలో దశాబ్ది ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సమావేశమై వారికి దిశా నిర్దేశం చేశారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, అన్ని వర్గాల వారి కృషితో గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను పునఃశ్చరణ చేసుకుంటూ ప్రజలకు వీటి గురించి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను చేపడుతోందని అన్నారు. పండుగ వాతావరణంలో ఉత్సాహభరితంగా ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని మంత్రి సూచించారు. అందరి సహకారం, భాగస్వామ్యంతోనే వేడుకలు విజయవంతం అవుతాయన్నారు. తొమ్మిదేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, వివిధ వర్గాల ప్రజలకు చేకూరిన మేలు గురించి శాఖల వారీగా కరపత్రాలు, ఫ్లెక్సీలు, బుక్ లెట్ల ద్వారా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్యుత్, సాగునీటి రంగం, పారిశ్రామిక ప్రగతి, విద్య, వైద్యం, సంక్షేమం, ఐ.టీ రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రజలకు విశదపర్చాలన్నారు. నియోజకవర్గాలకు జిల్లా స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా, మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు ప్రణాళికా బద్దంగా కృషి చేయాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మమేకమై ప్రజలందరినీ భాగస్వాములు చేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవ కార్యక్రమం ఉంటుందని, 3న అన్ని రైతు వేదికల్లో రైతు దినోత్సవం జరుపాలని, 4న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్షా దివస్, 5న విద్యుత్ విజయోత్సవం, 6న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ కారక్రమాలను నిర్వహించాలని వివరించారు. 9న తెలంగాణ సంక్షేమ సంబరాలను, 10న తెలంగాణ సుపరిపాలన దినోత్సవాన్ని, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం, 15న పల్లె ప్రగతి దినోత్సవం, 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 17న తెలంగాణ గిరిజనోత్సవం, 18న తెలంగాణ మంచినీళ్ల పండుగ, 19న తెలంగాణ హరితోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. 20న తెలంగాణ విద్యా దినోత్సవంలో భాగంగా అన్ని కళాశాలలు, పాఠశాలల్లో జెండాను ఎగురవేయాలని, విద్యాలయాలను అందంగా ముస్తాబు చేయాలని, విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేయాలని, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించాలని, మన ఊరు -మన బడి పనులు పూర్తయిన చోట పాఠశాలలను ప్రజాప్రతినిధులచే ప్రారంభోత్సవాలు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 21 న తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఆలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలను అలంకరింపజేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. 22 న అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధమైన త్రాగునీరు అందిస్తున్నామని ఆయా విషయం ప్రజలకు స్పష్టంగా తెలియచెప్పాలన్నారు. ఒకప్పుడు త్రాగునీటి కోసం మహిళలు బిందెలు పట్టుకుని కిలోమీటర్లు పాయి నీళ్ళు తెచ్చుకున్న సందర్భాలు ఉన్నాయని, నాడు నీటి కోసం గొడవలు జరిగి బిందెలు సొట్టలు పడేవని, కానీ నేడు మహిళల బుగ్గలకు సొట్టలు పడుతున్నాయే తప్ప బిందెలు లేవన్నారు. హరితోత్సవంలో పాల్గొనే అటవీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు గతంలో నాటిన మొక్కల సంరక్షణ, ట్రీ గార్డ్స్ లేని మొక్కలకు ట్రీ గార్డ్స్ ఏర్పాటు, మొక్కలకు నీటి వసతులు తదితర చర్యలు తీసుకోవాలి అన్నారు. మన ఊరు-మన బడి పథకం ద్వారా జిల్లా లో ఎంపిక చేసి అభివృద్ధి చేసుకున్న పాఠశాలకు సంబందించిన వివరాలతో కూడిన పట్టిక లు ఏర్పాటు చేసి ఆయా స్కూల్ పరిధిలో విస్తృతంగా ప్రచారం చేయాలని తద్వారా ఎక్కువ మంది విద్యార్థులు ఆకర్షితులై పాఠశాలలో చేరుతారని వివరించారు. సమైక్య రాష్ట్రంలో వంచన, అనేక రకాల మోసాలకు గురైన తెలంగాణ సమాజం ప్రత్యేక రాష్ట్రం కోసం ఆరు దశాబ్దాలకు పైగా అలుపెరుగని పోరాటం చేసిందని మంత్రి గుర్తు చేశారు. ఉద్యమ నాయకుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ గారు మలిదశ తెలంగాణ పోరుకు శ్రీకారం చుట్టి, సబ్బండ వర్ణాలను ఏకం చేసి చావు నోట్లో తలపెట్టి తెలంగాణ కలను సాకారం చేశారని అన్నారు. ఆ సమయంలో తెలంగాణ సమాజాన్ని అనేక మంది గేలి చేశారని, పరిపాలన చేతకాదని, అంధకారం అలుముకుంటుందని తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసేలా అవహేళన పర్చారని నాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. అయితే అనేక మంది యువకులు, విద్యార్థులు త్యాగాల పునాదులపై, ప్రజలందరి పోరాటంతో సాధించుకున్న తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ తన దార్శనిక పాలనతో కేవలం తొమ్మిదేళ్ల స్వల్ప వ్యవధిలోనే యావత్ దేశం ఆశ్చర్యపోయే రీతిలో అనేక రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. తలసరి ఆదాయంలో, తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కరోనా సంక్షోభ సమయంలో జాతీయ వృద్ధి రేటుతో ఇతర అనేక రాష్ట్రాల వృద్ధి రేటు దిగజారిందని, తెలంగాణ వృద్ధి రేటు మాత్రం నాలుగు శాతం పెరిగిందని వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలనతో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు విశేషంగా లబ్ది చేకూరుతోంది, పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలు అనితర సాధ్యమైన అభివృద్ధిని సంతరించుకున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా కేవలం మూడు శాతం జనాభా మాత్రమే కలిగి ఉన్న తెలంగాణకు జాతీయ స్థాయిలో వరుసబెట్టి 36 శాతం మేర వివిధ అభివృద్ధి అంశాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పలు అవార్డులు దక్కడం గర్వకారణమన్నారు. ఇలా పలు అవార్డులు వరిస్తుండడం తెలంగాణ ప్రభుత్వ సుపరిపాలన తీరుకు, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా దక్షతకు నిదర్శనం అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో సాగు రంగం ఐదింతలు అభివృద్ధి చెందిందని అన్నారు. 2014 వరకు కేవలం 16 లక్షల ఎకరాల్లో మాత్రమే రాష్ట్ర వ్యాప్తంగా వరి పంట సాగయ్యేదని, ప్రస్తుతం పంటల పెట్టుబడి, ఉచిత విద్యుత్, సాగు నీటి వసతి కల్పించడంతో 56 లక్షల ఎకరాల్లో వరి పంట పండిస్తున్నారని వివరించారు. వరి సాగులో పంజాబ్ ను సైతం అధిగమిస్తూ, దేశం మొత్తంలో యాభై శాతం ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రమే సాగు చేసే స్థాయికి ఎదిగిందన్నారు. వ్యవసాయం అనే కాకుండా ఏ రంగాన్ని చూసినా కనీసం మూడింతల అభివృద్ధి కనిపిస్తుందని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని, యాదాద్రి ఆలయం, పోలీస్ కమాండ్ కంట్రోల్, ఐటి హబ్, కేబుల్ బ్రిడ్జీలు, ఫ్లై ఓవర్లు, రాజ్యాంగ నిర్మాత అంబెద్కర్ విగ్రహం, నూతన సచివాలయ నిర్మాణం, అమరవీరుల స్మారక చిహ్నం వంటి అనేక ప్రఖ్యాత కట్టడాలను అనతికాలంలోనే పూర్తి చేసుకోవడాన్ని చూసి ప్రపంచమే అబ్బురపడుతోందని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ, దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంతం తరపున విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాల్సిందిగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. ప్రభుత్వ విప్ రేగ కాంతారావు, ఎమ్మెల్యేలు వనమా వేంకటేశ్వర రావు, హరిప్రియ నాయక్, డిసిసిబి చైర్మన్ కురాకుల నాగభూషణం,ఐటీడీఏ పీవో గౌతమ్ పొట్రు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతా మాలక్ష్మీ, లైబ్రరీ చైర్మన్ దిండిగల రాజేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



# కేసీఆర్‌ను గద్దె దింపే.. దమ్మున్నోళ్లా..?



సమాజాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ని గద్దె దింపుతామని.. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తొలగిస్తామని విర్రవీగుతున్న వారికి చురకలు అంటించారు. ఏం చూసుకుని ఎగిరి పడుతున్నవు... అభివృద్ధి నిరొాదకుడివి నీలాంటి వారికి ప్రజలే సరైన సమయంలో బుద్ది చెబుతారని హెచ్చరించారు. మారుమూల ప్రాంతాల్లో కూడా కోట్ల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి చేసుకోవడం పట్ల రెగాను అభినందించారు. హైద్రాబాద్ లో 24 గంటల కరెంట్ ఉంటది.. మారు మూల ప్రాంతాల్లో కూడా 24గంటల కరెంట్ ఉంటుందన్నారు. మనసున్న మహారాజు మన ముఖ్యమంత్రి కేసీఅర్ గారు అని, తెలంగాణ సమాజం అభివృద్ధి చెందాలనే ఆకాంక్ష తో నే ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా కోట్ల రూపాయల్లో నిధులు మంజూరు చేస్తున్నారు అన్నారు. సమైక్య పరిపాలనలో సాధ్యం కాని చిన్న చిన్న పనులు కూడా నేడు స్వరాష్ట్రంలో సాధ్యమైంది న్నారు. మన పక్కనే ఉన్న గోదావరి వోరుసుకుంటుపోయి వేల టిఎంసి లు సముద్రంలో కలుస్తున్న తరుణంలో మన ముఖ్యమంత్రి కేసీఅర్ ముందు చూపుతో ఆయా జలాలు నిరుపయోగం కావద్దు అని తలంచి గోదావరి నీరు నేడు 30 నుండి 40 టిఎంసి లు నిత్యం ఉండే విధంగా ప్రణాళికలు చేశారని, సీతారాం ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా రైతాంగానికి సాగు నీరు అందించి ఉభయ జిల్లాలను సస్యాశామలం చేసే దిశగా ముందుకు సాగుతున్నామని అన్నారు. విద్యుత్ ఎప్పుడూ ఉంటుందో.. ఎప్పుడూ పోతుందో తెలియని పరిస్థితుల నుండి నేడు రెప్ప పాటున కూడా విద్యుత్ పోకుండా అందిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అవతరించి 9సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ సంవత్సరం లోకి అడుగు పెడుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్ వాడి సెంటర్ లో గర్భిణీలకు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం పెడుతూ వారి మొహాల్లో చిరునవ్వులు చిందిస్తున్నారని అన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా అనేక అభివృద్ధి పనులు చేపడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వైపు ప్రజలు నిలబడాలని కోరారు. గత ఏడాది వచ్చిన గోదావరి వరదల సమయంలో ముఖ్యమంత్రి కేసీఅర్ గారు ప్రత్యేక చొరవ చూపిన దరిమిలా ముంపు బాధితులను ఆదుకున్నది తెలంగాణ ప్రభుత్వం అని, వారం రోజుల పాటు భద్రాచలంలో తాను స్వయంగా అక్కడే ఉండి ఎప్పటికప్పుడు వారికి కావాల్సిన సహాయ సౌకర్యాలు అందిస్తూ బాధితులకు అండగా నిలిచి వారిని కాపాడుకున్నామని స్పష్టం చేశారు. దేశాన్ని వణికించిన కరోనా క్లిష్ట సమయంలో ఎక్కడికి పోయారు మీరంతా..? ఎక్కడ దాక్కున్నారు..? ప్రాణ భయంతో సురక్షిత ప్రాంతాల్లో దాచుకున్నారని ధ్వజమెత్తారు. ఆసుపత్రిలో, కోవిడ్ బాధితులకు అండగా ఉన్నామని, వారికి మెరుగైన నాణ్యమైన వైద్యం, నిత్యావసర సరుకులు, ఆసుపత్రిలో సదుపాయాలు ఇలా అనేక సేవలు అందించింది తెలంగాణ ప్రభుత్వమే అన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఆశ్వాపురం మండలం గొండిగూడెం గ్రామంలో ఇసుక వాగు మీదగా రూ.7 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

మణుగూరు మండలం గట్టుమల్లారం గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న నూతన %=ూ% కార్యాలయ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

మణుగూరు పట్టణ కేంద్రంలో అంబేడ్కర్ సెంటర్ నుండి కోడిపుంజుల వాగు వరకు రూ.2.60 కోట్లతో చేపట్టనున్న రహదారి విస్తరణ మరియు సైడ్ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

మణుగూరు పట్టణ కేంద్రంలో మణుగూరు నుండి వయా చిన్నవారిగూడెం మీదగా నెల్లిపాక వరకు రూ.2 కోట్లతో చేపట్టనున్న రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆశ్వాపురం మండలం గొండిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి పువ్వాడ మాట్లాడారు. తెలంగాణ

# అజయ్ నీ వైఖరి మార్చుకో..!

- తీరు మార్చుకోకపోతే తిరుగుబాటు తప్పదు
- దళిత యువకుడిని రోడ్డుపై చితకబాదడం ప్రజాస్వామ్యమా...?
- గత ప్రభుత్వాల్లో ఇలాంటి సంఘటనలు చూడలేదు
- భావ ప్రకటన చేసిన వారిపై దాడులు ఎంతవరకు సమంజసం
- విలేకరుల సమావేశంలో పొంగులేటి అనుచరులు

**(ఖమ్మం ప్రతినిధి-విజయంన్యూస్):**

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఎంతో మంది మంత్రులను, కేంద్రమంత్రులను చూశాం.... కానీ పువ్వాడ అజయ్ కుమార్ లాంటి నియంత, రాచరికపు, అప్రజాస్వామిక మంత్రిని మేము ఎన్నడూ చూడలేదు. దళిత యువకుడు అని కూడా చూడకుండా నడిరోడ్డుపై వారి అనుచరులచే చితకబాదించడం ఎంత వరకు సమంజసం.... ఇప్పటికైనా అజయ్ నియంత వైఖరి మార్చుకోవాలి... తీరు మార్చుకోకపోతే రానున్న కాలంలో శీనన్న అభిమానుల తిరుగుబాటు తప్పదని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అనుచరులు మంత్రి అజయ్ కి హెచ్చరికలు జారీచేశారు. ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వూకంటి గోపాలరావు, డాక్టర్ కోటా రాంబాబు, విజయబాయి, మందడపు తిరుమలరావు తదితర నేతలు మాట్లాడారు. ఆ వివరాలు వారి మాటల్లోనే.... ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పొంగులేటి శీనన్న ఇచ్చిన పిలుపు మేరకు ఖమ్మం



లో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు పాల్వంచ నుంచి ఖమ్మం వచ్చిన శీనన్న అభిమాని, దళిత యువకుడు చీకటి కార్తీక్ పై బీఆర్ఎస్ మూకలు దాడికి పాల్పడిన విషయం విధితమే. గత మూడు నాలుగు రోజుల క్రితం సామాజిక మాధ్యమం వేదిక గా భావ ప్రకటన చేసిన నేపథ్యంలో చీకటి కార్తీక్ ను నడిరోడ్డుపైనే హత్య చేసే ప్రయత్నం సదరు బీఆర్ఎస్ నాయకులు చేశారు. పోలీసులు ఉన్నప్పటికి వారి సమక్షంలోనే దాడి జరగడం శోచనీయం. ఏదో విధి నిర్వహణ చేయాలి కాబట్టి చేసి సదరు యువకుడిని పోలీసులు కాపాడి తీసుకెళ్లారే తప్ప ఆ తదుపరి కేసును స్వీకరించలేదు. నా పై హత్య ప్రయత్నం జరిగిందని వాపోతూ చీకటి కార్తీక్ ఫిర్యాదు చేస్తే కనీసం పోలీసులు కేసు నమోదు చేయకపోవడం బీఆర్ఎస్ అరాచకపు పాలనకు అద్దం పడుతుంది. వెంటనే కేసును సుమోటోగా స్వీకరించి దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. గతంలోనూ ఖమ్మం నగరానికి చెందిన దళిత యువకుడు తేళ్లూరి రామకృష్ణ, గిరిజన నాయకుడు బోడా శ్రావణ్ కుమార్ పై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడికి పాల్పడితే ఇంతవరకు వారిపై చర్యలు శూన్యం. రోజురోజుకి శీనన్న ఎదుగుతున్న తీరును సహించలేకే మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో పాటు జిల్లాలోని ఇతర బీఆర్ఎస్ నేతలు ఇలాంటి దుశ్చర్యలను ప్రోత్సాహిస్తున్నారు. మా నాయకుడు పొంగులేటి శ్రీనన్న అన్నట్లు అధికారం ఎవడబ్బా సొత్తు కాదు అనే విషయాన్ని ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు గుర్తెరగాలి. మధిరలోనూ పొంగులేటి శీనన్న కార్యాలయం పై దుండగులు దాడి చేశారు. ఇది అమానుషం. మా నాయకుడు శాంతియుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాలని భావించేవాడు.... ఆయన అడుగుజాడల్లో మేము కొనసాగుతున్నాం కాబట్టి ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయ విమర్శలు మాత్రమే మేము చేస్తూ వస్తున్నాం. ఇది బీఆర్ఎస్ నేతలకు, మరీ ముఖ్యంగా మంత్రి అజయ్ కు మీడియా ముఖంగా చివరి హెచ్చరిక. ఇలాగే మీ తీరు కొనసాగితే శీనన్న అభిమానులు తిరుగుబాటు చేయకతప్పదు. ఆ తరువాత జరిగే సంఘటనలకు మేము బాధ్యత వహించలేమంటూ వారి ప్రసంగాలను ముగించారు.

# ధాన్యం, మొక్కజొన్నలను త్వరగా కొనుగోలు పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి..

120045.320 మెట్రిక్ టన్నుల ధాన్యం సంబంధిత మిల్లులకు తరలించినట్లు ఆయన అన్నారు. ఇప్పటి వరకు 2270 మంది రైతులకు 31 కోట్ల 65 లక్షల 32 వేల 496 లు ధాన్య మొత్తం వారి వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఆన్లైన్ నమోదులు వెంట వెంటనే పూర్తి చేయాలన్నారు. రవాణాకు వాహనాల ఏర్పాటు వెంట వెంటనే చేపట్టాలన్నారు. ధాన్య సేకరణ ఎక్కువగా జరుగుతున్న కేంద్రాల వద్దకు అవసరమైన లారీల ఏర్పాటు చేయాలన్నారు. గన్నీ బ్యాగులు అవసరమైన చోట ముందస్తుగా అందజేయాలన్నారు. జిల్లాలో 44 మొక్కజొన్న సేకరణ కేంద్రాలను ప్రతిపాదించి, ఇప్పటికి 37 కేంద్రాలను పారంభించినట్లు తెలిపారు. 31 కొనుగోలు కేంద్రాల్లో 5,331 మంది రైతుల నుండి 31913.953 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎఫ్ఏక్యూ ఖచ్చితంగా పాటించాలని ఆయన అన్నారు. కేంద్రాల వద్ద రైతులు, హమాలీలకు నీడకు షామియానా, త్రాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా ప్రదేశాల్లో ధాన్యం, మొక్కజొన్నల దిగుబడిని బట్టి కేంద్రాల వద్ద గన్నీ బ్యాగులు ముందస్తుగా ఇండెంట్ చేసుకోవాలని, లారీలు వెంటనే వచ్చేలా అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులకు ఏ దశలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, డిఆర్డీవో విద్యాచందన, డిసిఓ విజయ కుమారి, డిసిఎస్ఓ రాజేందర్, ఆర్టీవో కిషన్ రావు, డిఎంసీఎస్ సోములు, డిఎం మార్క్ ఫెడ్ సునీత, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు రాజేశ్వర రావు, అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్పోర్టర్లు పాల్గొన్నారు.



# నిరుద్యోగుల మోముల్లో చిరునవ్వే నా లక్ష్యం...!

- ప్రతి ఏడాది రెండు సార్లు జాబ్ మేళా నిర్వహిస్తా
- అర్హులైన ప్రతిఒక్కరికి ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత నాది
- ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఇది నా హామీ
- మెగా జాబ్ మేళా ప్రారంభోత్సవంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**(ఖమ్మం ప్రతినిధి-విజయంన్యూస్):**

నిరుద్యోగ యువతీ, యువకుల మోముల్లో చిరునవ్వు చూడలనేదే నా ప్రధాన లక్ష్యం.... ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ప్రతి ఒక్క నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత నాది... ఇందు కోసం ప్రతి ఏడాది ఉమ్మడి ఖమ్మంజిల్లాలో నాకు పదవి ఉన్న లేకున్నా జాబ్ మేళాలను నిర్వహిస్తా... ఇది నా హామీ అని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. 120కి పైగా కంపెనీల ద్వారా 10వేల కు పైగా ఉద్యోగాలను నిరుద్యోగులకు ఇప్పించేందుకు ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ లో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని నిరుద్యోగ సోదరసోదరీమణులందరి ఆశలను, ఆశయాలను నెరవేర్చేందుకు నేను పూనుకున్నాను. వీలైనంత త్వరలో ప్రతి ఒక్కరి ఆశయాలను నెరువేరుస్తానని హామీ ఇస్తున్నాను. ఈ మెగా జాబ్ మేళాలో 21వేల మందికి పైగా అభ్యర్థులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. సుమారు 15వేల మందికి పైగా అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకానున్నారు. హాజరైన ప్రతి ఒక్క అభ్యర్థికి ఎంత సమయమైనా ఇంటర్వ్యూ నిర్వహించి వారి అర్హత, ప్రతిభ ఆధారంగా అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇప్పిస్తాం. రూ.15వేలు మొదలుకొని రూ. 65వేల వరకు నెలసరి వేతనాలు చెల్లించే కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయి. చెవిటి, మూగ, వికలాంగులు, ట్రాన్స్ జెండర్లు మొదలగు వారికి ప్రత్యేక ప్యాకేజీలతో జాబ్ లు ఇప్పించేందుకు కూడా ప్రత్యేక ఏర్పాట్లను చేయడం జరిగింది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలంటూ తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం ఇంటర్వ్యూలో ప్రతిభ కనబర్చి ఉద్యోగం సాధించిన వారికి పొంగులేటి అపాయింట్మెంట్ ఆర్డర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, వూకంటి గోపాలరావు, జారె ఆదినారాయణ, డాక్టర్ కోటా రాంబాబు, విజయబాయి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, మలీదు జగన్, మియాభాయ్, నారపోగు వెంకట్, రైట్ ఛాయిస్ మెండెం కిరణ్ కుమార్, కొత్త కోటేశ్వరరావు, జాబ్ మేళా కన్సల్టెన్సీల నిర్వాహకుడు మన్ మోహన్ తదితరులున్నారు.

# రాష్ట్ర దశాబ్ది వేడుకలను పండుగలా చేయండి

**వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆదేశించిన చీఫ్ సెక్రటరీ శాంతికుమారి**

**ఖమ్మం, మే 29(విజయం న్యూస్):**

పండుగ వాతావరణంలో వైభవోపేతంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, జూన్ 2 నుంచి జూన్ 22 వరకు రాష్ట్ర దశాబ్ది వేడుకలలో మన ప్రగతి చాటేలా విధంగా ఘనంగా నిర్వహించాలని అన్నారు. రైతు దినోత్సవం, ఊరురా చెరువుల పండుగ నిర్వహణ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. రైతు దినోత్సవం నాడు జిల్లాలో ఉన్న రైతు వేదికల్లో వేడుకలు జరగాలని, ప్రతి గ్రామం నుంచి రైతులను డప్పులతో ఘనంగా పండుగ వాతావరణంలో రైతు వేదికలకు తీసుకొని రావాలని, అక్కడ ప్రభుత్వం ప్రతి రైతుకు కల్పించిన సౌకర్యాలు, అందించిన సహాయంపై తెలియజేయాలని, భోజన ఏర్పాట్లు ఉండాలని అన్నారు. జూన్ 8న ఊరురా చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువు వద్ద బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైసమ్మ పూజ, భోజనాలు పకడ్బందీగా చేయాలని తెలిపారు. రైతు దినోత్సవం, ఊరురా చెరువుల పండుగ నిర్వహణకు జిల్లాలో అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని, క్షేత్ర స్థాయిలో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు కావద్దని సీఎస్ అన్నారు. విద్యుత్ రంగంలో గత పరిస్థితి, నేడు సాధించిన ప్రగతి తెలియజేస్తూ నాడు- నేడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, పోలీస్ ఆధ్వర్యంలో సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలని అన్నారు. పారిశ్రామిక ప్రగతి, సాగునీటి రంగంలో సాధించిన విజయాలు తెలియజేయాలని అన్నారు. జూన్ 9న సంక్షేమ సంబురాలు సందర్భంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండవ విడత గొర్రెల పంపిణీ, అవకాశం ఉన్న చోట ఇంటి పట్టాల పంపిణీ, బీసి కులవృత్తుల ఆర్థిక



సహాయం ప్రారంభించాలని అన్నారు. బీసి కుల వృత్తుల ఆర్థిక సహాయంపై క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ప్రకారం మార్గదర్శకాలు అందిస్తామని, దాని ప్రకారం లబ్దిదారులను ఎంపిక చేసి జూన్ 9న ప్రారంభించాలని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన జిల్లాలు, మండలాలు, గ్రామాల వివరాలు తెలియజేయాలని, మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో సాధించిన ప్రగతి, క్రొత్త ఆసుపత్రుల ఏర్పాటు, అందిస్తున్న అదనపు సేవలను వివరించాలని, వైద్య, ఆరోగ్య శాఖ దినోత్సవం నాడు కేసిఆర్ న్యుట్రిషన్ కిట్ ప్రారంభించాలని అన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి సాధించిన విజయాలు ఘనంగా చాటాలని సీఎస్ అన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేయాలని, సఫాయిన్న సలాం అన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. మిషన్ భగీరథ క్రింద ఇంటింటికి త్రాగునీటి సరఫరా, గిరిజనోత్సవం, పెరిగిన పచ్చదనం, విద్యాశాఖలో సాధించిన ప్రగతి పక్కాగా తెలియజేయాలని, ఆధ్యాత్మిక రంగంలో సాధించిన ప్రగతి, అమరుల సంస్కరణ కార్యక్రమాలు పకడ్బందీగా జరగాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, జిల్లాలోని 129 రైతు వేదికల్లో రైతు దినోత్సవం నిర్వహిస్తామని, లైటింగ్ చేపట్టి, షామియానాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. రోజువారి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు విజయవంతంగా చేపడతామన్నారు. జిల్లాలో అన్ని శాఖల ద్వారా సాధించిన ప్రగతి వివరించేలా పకడ్బందీగా దశాబ్ది వేడుకలను నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్. మధుసూదన్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు రాధిక గుప్తా, మయాంక్ సింగ్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంను వదలని పొంగులేటి

**మొదటి పేజీ తరువాయి..**

ఉద్యమ సమయంలో నిరుద్యోగుల పట్ల ఎనలేని ప్రేమను కురిపించిన సీఎం కేసీఆర్, ఆ తరువాత పీఠం ఎక్కిన తరువాత నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసం...? అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో లక్షలాది ఉద్యోగ ఖాళీలు ఉంటే నామ మాత్రపు ఖాళీలను భర్తీ చేసేందుకు టీఎస్పీఎస్సీ ఉద్యోగాల నోటిఫికేషన్ వేశారని అన్నారు. దీంతో నిరుద్యోగులు లక్షల రూపాయలు ఫీజులు కట్టి ట్యూషన్లకు వెళ్లి చదువుకుంటే అంతలోనే పేపర్ లీకేజీలంటూ భయాందోళనకు గురి చేశారని అన్నారు. మళ్లీ అందులోనూ పింక్ కలర్ షర్ట్ వేసుకున్న తరుపు వారికి ఉద్యోగాలను ఇప్పించేందుకు పేపరును లీకేజీ ని చేయించారని ఆరోపించారు. అంతే కాదు ఉద్యోగాలు ఇవ్వలేక నిరుద్యోగుల పట్ల చవితి ప్రేమను చూపిస్తున్నారని విమర్శించారు. మూడు నెలలు గడుస్తున్నా నిందితులపై ఇంతవరకు చర్యలు లేవని, సిట్టింగ్ జడ్జి చే లేదా సీబీఐ చే విచారణ జరిపించాలని గతంలోనూ డిమాండ్ చేశాం... ఇప్పుడు కూడా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. తినితినక కష్టాలు పడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను చదివిస్తే వారి ప్రతిభకనుగుణంగా ఉద్యోగాలను కేటాయించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి పేపర్ లీకేజీ చేయించడం దురదృష్టకరమన్నారు. టీఎస్పీఎస్సీ పరీక్ష రాసిన ప్రతి ఒక్క నిరుద్యోగ యువత అకౌంట్లో లక్ష రూపాయాలను ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికి నిరుద్యోగ భృతి నెలకు రూ. 3వేలు ఇవ్వాలని, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాకుండా వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నైతే ఖాళీలు ఉన్నాయో వాటన్నింటిని భర్తీ చేసేందుకు కావాల్సిన నోటిఫికేషన్లు వేసి నిరుద్యోగుల పట్ల మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. మాటలతో మాయలు చేయడం కాకుండా మనసుతో ఆలోచించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



# ఊరు కదిలింది..భక్తి పొంగింది

## ఘనంగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

## బోనాలతో భారీగా తరలివచ్చిన మహిళలు

**ఏన్కూరు. మే 29(విజయం న్యూస్)**



ఏన్కూరు మండలం తూతక్క లింగన్నపేట గ్రామంలో సోమవారం జరిగిన కట్ట మైసమ్మ,గంగమ్మ తల్లి, పోతురాజు స్వాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి భక్తి పారవశ్యం తో ఊరు మొత్తం కదిలింది. శోభకృత నామ సంవత్సర, జ్యేష్ట మాస శుద్ధ నవమి సోమవారం ఉదయం 8 గంటల 41 నిమిషాలకు ఉత్తర నక్షత్ర యుక్త మిధున లగ్న పుష్కరాంశ శుభ ముహూర్తాన కట్ట మైసమ్మ తల్లి, గంగమ్మతల్లి, పోతురాజు స్వాముల వారి యంత్ర దేవతా స్థిర విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. మేళ తాళాలు మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ట మహోత్సవం నిర్వహించారు. బోనాలను ఎత్తుకొని భారీ సంఖ్యలో మహిళలు చిన్నారులు తరలివచ్చి బోనాలను సమర్పించారు.ఉదయం నుంచి పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు కురవాలని, పంటలు పండాలని, గ్రామ దేవతలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కమ్యూనిస్టు నేత కుటుంబానికి పరామర్శ ఆర్థిక సాయం


## అండగా ఉంటానన్న బీపీ నాయక్

**తల్లాడ మే29 (విజయం న్యూస్)**

కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు నీలాల ఏసు కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వైరా అసెంబ్లీ బీజెపి నేత బీపీ నాయక్ మండలంలోని రామనర్సయ్య నగర్ గ్రామంలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు నీలాల ఏసు మరణ వార్త విని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబ స్థితిగతులను, యేసు మరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మనోధైర్యంతో ముందుకు సాగాలని వారికి నెలకు సరిపడా నిత్యవసర వస్తువులను పంపిణీ చేస్తూ బిజెపి పార్టీ అండగా ఉంటుందని భరోసానించారు. అనంతరం గ్రామంలో పలు వీధుల్లో తిరుగుతూ కొన్ని కుటుంబాలను కలిశారు, వారి సమస్యలను తెలుసుకొని ఈ గ్రామం కేంద్రంగా మరిన్ని పర్యటనలు చేస్తామని గ్రామానికి అండగా ఉండి సమస్యలకే పోరాటాలు కొనసాగిస్తామని అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇంచార్జ్ గుగులోత్ ప్రశాంత్ కుమార్ బూత్ అధ్యక్షులు ఆంగోత్ రాజా, నవీన్, కిషోర్, అశోక్, సాయి, నాగ, నరేష్, సురేష్, సూర్య చంద్, భీమ్ల, కళ్యాణ్, సందీప్, సాగర్, రామకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

# సేవాతత్పరుడు డాక్టర్ పులిపాటి..

- ఖమ్మంలో విశేష సామాజిక సేవాకార్యక్రమాలు
- పులిపాటి ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థుల విదేశీ విద్యకు పదిలక్షలు రూపాయలు అక్షోభయ ట్రస్టుకు అందజేత
- ఖమ్మం పులిపాటి నర్సింగ్ కాలేజీ లో వెల్లువెత్తిన పులిపాటి దంపతుల సేవలు.
- నిరుపేదలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమాలతో నిరుపేదల్లో నిండిన ఆనందం...
- సర్వమత ప్రార్థనలతో ఆశీర్వచనాలు అందుకున్న డాక్టర్ పులిపాటి దంపతులు




(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

కులమతాలకతీతంగా డాక్టర్ పులిపాటి సామాజిక సేవల నిర్వహణ అభినందనీయమని, సేవాతత్పరులు డాక్టర్ పులిపాటి ప్రసాద్ అని బీఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కార్పొరేటర్ కమర్థపు మురళి, ,బుడిగెం శ్రీనివాస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అద్యక్షులు చిన్ని కృష్ణారావు, ఆర్యవైశ్య సంఘం వనమాసూరి, కిరాణాజాగీర్ అధ్యక్షులు వేములపల్లి వెంకటేశ్వరరావు, ప్రముఖ వైద్యులు కావ్యహాస్పటల్ సీఈఓ డాక్టర్ కావ్యచంద్ యాలముడి, మాతృశ్రీ ఎండీ డాక్టర్ నీరజ, పలువురు కార్పొరేటర్లు అన్నారు.. సోమవారం ఖమ్మం నగరంలోని. పులిపాటి నర్సింగ్ కళాశాల ఆవరణలో సామాజిక సేవా కార్యక్రమాలు గోళ్ళ రాధాకృష్ణ సభాధ్యక్షతన



ఘనంగా జరిగాయి.. పులిపాటి అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పులిపాటి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు..మరికొంత మంది విద్యార్థినులు స్వచ్ఛందంగా విచ్చేసి సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని హ్యాపీ బర్తడే అంటూ వారి అభిమానానికి అవధులు లేకుండా పోయింది..ఒక ప్రజాప్రతినిధికి వుండాల్సిన చరిష్మా పులిపాటి వుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.. .ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ....ఎవరైనా పులిపాటి వద్దకు వచ్చి అన్నా అనివస్తే సహాయం చేసే హెల్పింగ్ హాండ్స్ పులిపాటిదని, హెల్పింగ్ హార్ట్ ఉన్న మహోన్నతుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్ అని, సామాజిక సేవకులు విద్యావేత్త పులిపాటి నర్సింగ్ కళాశాల అధినేత భారత రాష్ట్ర సమితి నాయకులు డాక్టర్ పులిపాటి ప్రసాద్ జన్మదినోత్సవాన్ని ఆర్భాటాలు లేకుండా సామాజిక సేవలరూపంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు.. సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని పులిపాటి నర్సింగ్ కాలేజీ ఆవరణలో నిరుపేదలకు అన్నదానంతో పాటు వస్త్రదానం, ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమాలు జరుపడం హర్షణీయమన్నారు..డాక్టర్ పులిపాటి ప్రసాద్ తండ్రి నరసింహారావు జ్ఞాపకార్థం 10 లక్షల రూపాయలను నిరుపేద విద్యార్థుల విదేశీవిద్యకు కోసం అక్షోభయ ట్రస్ట్ కు అందజేయడం, ఖమ్మం జిల్లాలో బస్వాపురం గ్రామంలో సాయిబాబా విగ్రహాన్ని వితరణ




కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యానిదికి 55 వేల 116 లను వనమా సూరికి సామాజిక సేవాకార్యక్రమాలకు 25 వేల రుపాలయ చెక్కును రామకృష్ణకు అందజేయడం సంతోష దాయకమన్నారు..ఈమేరకు వారు పులిపాటి దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బుర్రి వెంకట్, మాజి కార్పొరేటర్ నర్రా రమేష్, బీసీ జేఏసీ చైర్మన్ పాల్వంచ రామారావు %ంఎ% వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బివి రాఘవులు, ఉపెందేర్ నాయక్, వరప్రసాద్, వెంపటి రంగారావు,లక్ష్మీనారాయణ, గుమ్మడివెల్లి శ్రీనివాస్, అవోప కృష్ణమూర్తి, బీఆర్ఎస్ నాయకులు చిన్నా, ప్రముఖులు శ్రీ కళారెడ్డి, జ్యోతి, రాణి, ఆశా, రామకృష్ణ, ప్రతాప్, ప్రవీణ్ పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక సోసైటి గ్రామ సభను వెంటనే జరిపించాలి

**కలెక్టరేట్ కార్యాలయం ముందు తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన**

**కలెక్టర్‌కు వినతి చేసిన నాయకులు**



(ములుగు-విజయం న్యూస్)

ములుగు జిల్లా వెంకటాపురం మండలం అంకన్నగూడెం (పూజారి గూడెం) గ్రామంలో జరగవలసిన పీసా గ్రామసభను వాయిదా వేయడం పై ఆందోళన చేపట్టిన తుడుం దెబ్బ నాయకులు. ములుగు జిల్లా కేంద్రంలోని సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు పీసా గ్రామ సభలను వాయిదా వేస్తూ అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారంటూ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటిడిఏ పిఓ అంకిత్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు యాసం రాజు మాట్లాడుతూ వెంకటాపురం మండలం రామచంద్రపురం గ్రామపంచాయతీ పరిధిలోని అంకన్నగూడెం పీసా క్లష్టర్ పూజారి గూడెం పీసా గ్రామసభ అర్హత కలిగిన శ్రీ కొమ్మలమ్మ గిరిజన ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ కు సంబంధించిన సొసైటీ ఈనెల 27వ తేదీన జరగాల్సిన గ్రామసభను అధికారులు వాయిదా వేయడం అమానుషమని అన్నారు. ఉన్నతాధికారుల సమాచారం మేరకు శనివారం రోజున స్థానిక పాఠశాల ఆవరణకు గిరిజనులు చేరుకొని అదికారుల కొసం ఎదిరి చూస్తుండా ముందస్తు సమాచారం లేకుండానే గ్రామసభను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించి ఆదివాసి గిరిజన పట్ల చోద్యం చేస్తున్నారన్నారు. గిరిజన సొసైటీ గ్రామసభలను వాయిదా వేయడానికి పని కట్టుకుని కొండూరి రమేష్ బాబు, బట్టు శీను, మరియు ముత్యాల్ రావు అనే ముగ్గురు వ్యక్తులు వారి స్వలాభం కోసం గిరిజన సొసైటీల సమావేశాలను వాయిదా వేస్తూ సోసైటి ఆదాయానికి గండి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన జిల్లా శాఖ అధికారులు స్పందించి శ్రీ కొమ్మలమ్మ గిరిజన ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు మ్యూచువల్ కోఆపరేటివ్ సొసైటీ పీసా గ్రామ సభలను వెంటనే జరిపించి సొసైటీ నిర్వహణ జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదికారులను కోరారు. దీనికి స్పందించిన కలెక్టరేట్ అతి త్వరలో అదికారులతో చర్చించి గ్రామ సభ నిర్వహణ చేసి గిరిజన సోసైటీలకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, గ్రామ ప్రజలు, తుడుం దెబ్బ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# చెరువు బజార్‌లో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

**ఖమ్మం మే 29(విజయం న్యూస్)**

హజ్ యాత్రికులకు స్థానిక చెరువు బజార్లోని ఇమ్ముద్దాదుల్ ఉలూం మదర్స ప్రాంగణంలో ప్రభుత్వ వైద్యాధికారుల బృందం, హజ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వ్యాక్సినేషన్ తో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 36 మంది హాజరు కాగా వారిలో పురుషులు 20 మంది, స్త్రీలు 16 మంది ఉన్నారు. తమ జీవితంలో ఒక్కసారి అయినా హజ్ యాత్ర చేయాలని ప్రతి ముస్లిం ఆకాంక్ష , ప్రభుత్వం తరపున వెళ్లే హజ్ యాత్రికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు అనేక ఇతర సౌకర్యాలు , రాయితులు కల్పిస్తారు. ప్రైవేటుగా వెళ్లే వారికి ప్రభుత్వం తరపున వెళ్లేవారి కంటే ఖర్చు రెండింతలుగా ఉంటుంది. జూన్ 1వ తేదీన భద్రాద్రిబి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం పట్టణంలో మరోసారి హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందని హజ్ కమిటీ సభ్యులు షేక్. మక్బూల్ తెలిపారు. వ్యాక్సిలేషన్ సందర్భంగా వారి పత్రాలను పరిశీలిస్తూ, వారి వయసు రిత్యా అనారోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. సలహా, సూచనలు ఇస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్య బృందం హజ్ యాత్రికులకు వివరించింది. మదర్సా నిర్వాహకులు ముఫ్తీ జలాలుద్దీన్ హజ్ యాత్రికులకు, వైద్య బృందానికి ప్రత్యేకంగా భోజన సౌకర్యాన్ని గావించారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యుడు షేక్ మక్బూల్, డాక్టర్ . ప్రమీల, డాక్టర్ జి. సురేందర్, డాక్టర్. ఇవాంజని, డాక్టర్ . తబ సుమ్, వాక్సినేషన్ మేనేజర్ రమణ, సూపర్వైజర్లు శ్రీకాంత్, సత్యనారాయణ, నర్సులు గోపమ్మ, ఉమా, హకీమ్, మునిర్, పర్వేజ్, ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవితాలను నాశనం చేసింది బీజేపీ

- ప్రజలను మాటలతో మాయచేసింది సీఎం కేసీఆర్
- ఈ దిక్కుమాలిన ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుదాం
- హాత్ సే హాత్ జోడో యాత్రలో మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్
- సంభాని నేతృత్వంలో కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు



(సత్తుపల్లి-విజయం న్యూస్)

సత్తుపల్లి నియోజకవర్గంలో 51వ రోజు హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం కల్లూరు పట్టణంలో శాంతినగర్ నుండి కప్పలబందం రోడ్డు వరకు ర్యాలీగా జరిగిన ఈకార్యక్రమంలో ప్రజలు బ్రహ్మరథం పట్టగా మాజీమంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు సంభాని చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేసి కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తెలుపుతూ రాహుల్ గాంధీ సందేశాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై రూపొందించిన చార్జిషీట్‌ని ప్రజలకు అందిస్తూ ఈ క్రింది విధంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల సమయంలో దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేస్తామని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్లు కావస్తున్న ఇప్పటకీ అమలు చేయకుండా ప్రజలను దగా చేసింది బిఆర్ఎస్ పార్టీ... దళితుబంధు పేరుతో దళితుల ఓట్లకోసం రూ. 10లక్షల ప్రకటించి అరకొరగా ఇచ్చి దళితులను మోసం చేస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి, రైతులకు పంట రుణాలమాఫీ వంటి హామీలు ఇచ్చి నెరవేర్చలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికల కంటే ముందు ఇచ్చే ప్రతి హామిని అమలు చేసి తీరుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చాలా కష్టపడుతుందని, ప్రజలందరు ఆ కష్టాన్ని నమ్మి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎన్ టీయుసీ కార్యదర్శి కొత్తా సీతారాములు, పిసిసి సభ్యులు బైరెడ్డి మనోహర్ రెడ్డి, రాష్ట్ర జడ్పీటీసీ సంఘం అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, స్టేట్ ఎస్సీ సెల్ కన్వీనర్ కొండూరు కిరణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి, గోళ్ళ అప్పారావు, ఎంపిటిసి మాదిరాజు లక్ష్మణరావు, మాజీ ఎంపిపి గోపాలస్వామి, మాజీ ఎంపిటిసి కృష్ణారెడ్డి, పాయపూర్ సర్పంచ్ శర్మ, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొర్రపాటి సాల్మన్ రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివ వేణు పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెలికాని రాజబాబు, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపా సుధాకర్ ఇతర నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూలుస్తాం

**పేదల భూముల జోలికి వస్తే కెసిఆర్ సంగతి చూస్తాం.. గగ్గలపల్లి కార్నర్ మీటింగ్లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తీవ్ర సంచలన వ్యాఖ్యలు**

(నాగర్ కర్నూల్/ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

"కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన భూములను బలవంతంగా గుంజుకుంటే ఖబార్దార్. సీఎం కేసీఆర్.. నీ సంగతి చూస్తాం. మీ సర్కార్ ను కూలుస్తాం. మీ ప్రభుత్వం గుంజుకున్న భూములను చట్టబద్ధంగా తిరిగి వారికి అప్పగిస్తామని" సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు చేశారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా సోమవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గం, గగ్గలపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో గగ్గలపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 183లో దళిత, గిరిజనులకు ఇచ్చిన 200 ఎకరాల భూములను ధరణిలో బ్లాక్ చేయడం దుర్మార్గమన్నారు. దళిత గిరిజనులకు పంపిణీ చేసిన ఈ భూముల జోలికి వస్తే బాగుండదని ఖబర్దార్ అంటూ బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులకు మూడెకరాల భూ పంపిణీ చేస్తామని వాగ్దానం చేసిన సీఎం కేసీఆర్ అమలు చేయకపోగా గత ప్రభుత్వాలు ఇచ్చిన భూములను బలవంతంగా గుంజుకోవడం దుర్మార్గమన్నారు. స్మశాన వాటికలు, హరితహారం పేరిట దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కోవడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే టీఆర్ఎస్ ప్రభుత్వం దళిత గిరిజన బడుగు బలహీనవర్గాల నుంచి గుంజుకున్న భూములను తిరిగి చట్టబద్ధంగా వారికి అప్పగిస్తామని వెల్లడించారు. సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రంలో సమస్త తెలంగాణ సమాజం బాగుండాలని ఆదిలాబాద్ నుంచి పాదయాత్ర చేస్తున్నట్లు వివరించారు. ధనిక రాష్ట్రంలో సంపదంత దోపిడీ జరిగిందని, కొట్లాడి కోరి తెచ్చుకున్న రాష్ట్రంలో కొలువులు లేక నిరుద్యోగులు, ఇండ్లు లేక పేదలు, పించన్లు రాక వృద్ధులు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా 9 నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం నిత్యవసర సరుకుల కోత విధించి బియ్యం మాత్రమే ఇస్తుందని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 10 ఏండ్లు కావస్తున్న ఒక ప్రాజెక్టు కూడా పూర్తి చేయకుండా గాడిదలు కాస్తుందా అని విమర్శలు గుప్పించారు. పంట పొలాలకు సాగునీరు అందించే పిల్ల కాలువలను కూడా తవ్వ కుండా దున్నపోతు వలే బిఆర్ఎస్ ప్రభుత్వం నిద్రపోతున్నందున గగ్గలపల్లి గ్రామంలో 2500 ఎకరాల భూములకు సాగు నీరు అంధక రైతులు నష్టపోవలసిన దుస్థితి వచ్చిందని ఇందుకు ప్రధాన కారణం కేసీఆర్ అని మండిపడ్డారు. నియోజకవర్గంలో రైతుల పొలాలకు సాగు నీరు ఇవ్వవలసిన పిల్ల కాలువలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు లేదా అని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిచేసిన కాలువల్లో పారుతున్న నీళ్లను తామే ఇచ్చామని చూయిస్తూ శిలాఫలకాలు కట్టుకొని వాటి ముందు ఫోటోలకు ఫోజులు ఇవ్వడానికి సిగ్గుండాలని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని అమలు చేయకపోవడం వల్ల రైతుల ఖాతాలు బ్యాంకుల్లో బ్యాడ్ అకౌంట్స్ గా మారి బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడం వల్ల వడ్డీలకు అప్పులు తెచ్చుకొని సాగుకు పెట్టుబడి పెట్టుకోవాల్సిన దుస్థితి రైతులకు ఎదురైందన్నారు. ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉన్నందుకు సిగ్గుపడాలని అన్నారు. జడ్చర్ల, నాగర్ కర్నూల్, కొల్లాపూర్ తదితర రోడ్ల వెంట 15 రోజులుగా రైతులు ధాన్యం కుప్పలుగా పోసి నిరీక్షిస్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టించుకోకుండా ఏమైనా గాడిదలు కాస్తుండ్రా అని ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ప్రజావ్యతిరేక పాలనను ప్రశ్నించే గొంతుకల పట్ల ఈ ప్రభుత్వం నియంత్రంగా నిర్బంధం ప్రయోగిస్తున్నదని మండిపడ్డారు. భయం, భయం గుప్పిట్లో బతుకుతున్న తెలంగాణ సమాజాన్ని భయం పడగ నుంచి విముక్తి చేయడానికి రాష్ట్రంలో వచ్చే ఐదు నెలల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకొని స్వేచ్ఛాయుత వాతావరణంలో బతుకుదామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# మహిళా, యువత శక్తి ఏకం అవ్వాలి

- కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొద్దాం
- ఉద్యోగ అవకాశాలు కల్పించుకొని, పెరిగిన నిత్యవసర ధరలను తగ్గించుకుందాం
- కుల,మత తత్వ పార్టీలను గద్దె దింపుదాం
- హత్ సే హత్ యాత్రలో పీసీసీ సభ్యులు,నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

మహిళా, యువత శక్తి ఏకమై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని పిసిసి సభ్యులు, నగర్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ అన్నారు. హత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రఘునాథపాలెం మండలంలో మాంగ్య తండా, మూల గూడెం, ఎన్వీ బంజర లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రతి గడపను తడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో, కేంద్రంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర యావత్ దేశంలో పెనుమార్పు తీసుకువస్తుందని అందుకు నిదర్శనం కర్ణాటక ఎన్నికల విజయమే అని అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన స్ఫూర్తితో సిఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేస్తున్నారని దాని ద్వారా నేరుగా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటికి పరిష్కార మార్గాలు చూపుతున్నారని అన్నారు. వారిద్దరి స్ఫూర్తితో మండలంలో తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ యాత్ర చేయడం జరుగుతుందని తెలిపారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందరికీ అందుబాటులో ఉండే నిత్యవసర వస్తులు నేడు కొంత మందికి మాత్రమే అందుబాటులో ఉన్నాయని అన్నారు.



సామాన్య ప్రజలు ఏం కొనాలన్నా తినాలన్న మనసారా తినలేని పరిస్థితి దేశంలో నెలకొందని అన్నారు. సామాన్య మానవుడు మూడు పూటల కడుపు నిండా తినాలంటే మళ్ళీ ఇందిరమ్మ రాజ్యం రావాల్సిందే అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తె అన్ని రకాల వస్తువుల ధరలపై నియంత్రణ ఉంటుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కే సీ ఆర్ ప్రభుత్వం కులాల పేరుతో, కేంద్రంలో మోడీ మతాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. దేశం విచ్ఛిన్నం చేయడానికి మోడీ ఆరాట పడుతుంటే అందరం ఐక్యంగా ఉండాలని రాహుల్ గాంధీ ఆరాట పడుతున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ మంటే సామాన్య ప్రజల ప్రభుత్వ మనే నానుడి ఎప్పటి నుండో ఉందని అన్నారు. కచ్చితంగా కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చుకునే బాధ్యత అందరిపై ఉందని ప్రతి ఒక్కరూ అందుకు కృషి చేయాలని అన్నారు. మంచిర్యాల, జడ్చర్ల సభలలో వచ్చిన అశేష జనవహినిని చూసి మోడీ, కే సి ఆర్ లకు భయం పట్టుకుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఖమ్మం నియోజకవర్గ యూత్ డిక్లరేషన్ ఇంచార్జ్ పసుపులేటి దేవేందర్, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు భూక్యా బాలాజీ, సత్యం బాబు, బిహెచ్ రబ్బానీ, మారం కరుణాకర్ రెడ్డి, కొంటేముక్కుల నాగేశ్వరరావు, ఏలూరి రవికుమార్, దేవత్ శంకర్ నాయక్, బానోత్ వెంకట్రామ్, అంగోత్ వెంకన్న,బాల్య, బాలాజీ, బిచ్చు, రమేష్, రమేష్, జేత్య హరియ, ములగుడెం ఉప సర్పంచ్ బొడ రవి, గుగులోత్ బాల, యశ్వంత్, బానోత్ రమేష్, సాగర్, తది తరులు పాల్గొన్నారు.

# పిల్లల మనోరంజకం

## శారీరక మానసిక ఆరోగ్యం చిరునామా కిడ్స్ క్లబ్ ప్లే జోన్









(ఖమ్మం-విజయం న్యూస్):

నేటి ఉరుకులు పరుగుల జీవితంలో పిల్లలకు మనోరంజకం కల్పించడమే కాకుండా వారి శారీరిక, మానసిక ఆరోగ్యం గురించి పట్టించుకునే అవకాశం లేకుండా పోయిన స్థితిలో కిడ్స్ క్లబ్ ప్లే జోన్ ఖమ్మం నగరంలో గల ఎన్ఎస్పి రామాలయం పక్కన కొత్త బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేశారు. పిల్లల మనోరంజకం మరియు వారి ఉల్లాసం ఆహ్వానం తో పాటు శారీరక మానసిక ఆరోగ్యం విషయంలో చిరునామాగా కిడ్స్ క్లబ్ ప్లే జోన్ అలరిస్తోంది . వేసవిలో పూర్తి ఏసి సౌకర్యంతో ఇండోర్ ప్లే జోన్, పార్టీ వెన్యూ, డే కేర్, ఫుడ్ కోర్ట్ వంటి వసతులతో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సేవలందిస్తుంది. ఒకసారి సందర్శించండి.... మీ చిన్నారులకు సరికొత్త ఆటల ప్రపంచాన్ని పరిచయం చేయండి. అంటున్నారు కిడ్స్ క్లబ్ ప్లే జోన్ నిర్వాహకులు శెట్టి రంగారావు, వెంపటి వెంకటేశ్వర్లు. మరి ఎందుకు ఆలస్యం... చూద్దాం పదండి, సరికొత్త ఆటల ప్రపంచాన్ని...ఎన్ఎస్పి రామాలయం పక్కన కొత్త బస్టాండ్ బై పాస్ రోడ్డు సమీపంలో గల కిడ్స్ క్లబ్ ప్లే జోన్‌ను.

# హామీలను విస్మరిస్తే ప్రజా పోరాటాలు

**నిరుద్యోగ భృతి, రుణమాఫీ హామీలను అమలు చేయాలి**

**ప్రజాగర్జనకు తరలిరండి**

**సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం**



(ఖమ్మం-విజయంన్యూస్):

పాలకులు ఎవరైనా ఇచ్చిన హామీలను విస్మరించి పాలన సాగిస్తే ప్రజా పోరాటాలు తప్పవని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజలను అమలు చేయలేని హామీలతో ఎక్కువ కాలం వంచించలేరన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ ప్రజలకు రకరకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి ఖాతాలో డబ్బులు జమ సహా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టు కోలేదన్నారు. పాలనను విస్మరించి మత ప్రచారానికి ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. పార్లమెంటు భవన ప్రారంభోత్సవ సందర్భంగా నిమ్న వర్గాల పట్ల మోడీ వైఖరి బహిర్గతమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా మత విద్వేషాలను రెచ్చగొడుతున్న మోడీ సర్కారు సాగనంపాలని హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కేసిఆర్ నిరుద్యోగ భృతి, రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు మొదలైన వాటిపై స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ అందులో ఏ ఒక్కటి పూర్తి చేయలేదన్నారు. పోడు భూములకు హక్కు పత్రాల విషయమై నాన్చివేత ధోరణి అవలంభిస్తుందని హేమంతరావు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ నాలుగున కొత్తగూడెంలో జరిగే ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామం నుండి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకుని బహిరంగ సభకు తరలి రావాలని కోరారు. ఖమ్మం జిల్లా నుంచి 300 బస్సులు, 100 ఇతర వాహనాల్లో తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని హేమంతరావు తెలిపారు. కార్యవర్గ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

# పొంగులేటిని రాజకీయంగా ఎదుర్కోలేకనే దాడులు

**ప్రజాస్వామ్య దేశంలో భౌతిక దాడులు సరికావు**

**పొంగులేటి అనుచరుడు చీకటి కార్తీక్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం**

(ఇల్లెందు-విజయం న్యూస్)

ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి అభిస్తున్న ఆదరణ,మద్దతు చూసి తట్టుకోలేక కావాలనే కొంతమంది బీఆర్ఎస్ గూండాలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయాలపై, అనుచరులపై దాడులకు పాల్పడటం సరికాదని నేడు ఇల్లందు పట్టణంలోని జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ నాయకులు మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛ ప్రతీ ఒక్కరి హక్కు అని,దానిని హరించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఎవరి విది విధానాలు వారు స్వేచ్ఛగా ప్రకటించుకునే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని,రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు,అవినీతిపై విమర్శలు చేస్తున్న నాయకులపై విమర్శలకు ప్రతి విమర్శలు చేయాలే తప్ప ఇలా కార్యాలయాలపై అనుచరులపై భహిరంగంగా దాడులకు దిగటం సరికాదని హితబోధ చేశారు. ఇకనైనా పద్ధతి మార్చుకుని విలువలతో కూడిన రాజకీయాలను చేయాలని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే మీకు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్తీక్ గారిపై దాడికి పార్పడ్డ వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, చిల్లా శ్రీనివాస్, తాటి బిక్షం, ముక్తి కృష్ణ, సువర్ణపాక సత్యనారాయణ, గుగ్లోత్ నాగార్జున, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

